సాక్షి
విశాఖపట్నం
శనివారం । 18 । అక్టోబర్ । 2025



గళమెత్తిన కలం

జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జర్నలిస్టుల భారీ నిరసన



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు, జర్నలిస్ట్ సంఘాల ప్రతినిధులు

దాబాగార్డెన్స్: 'సాక్షి' మీడియా సంస్థపై రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందంటూ జర్నలిస్టులు భగ్గుమన్నారు. ప్రజా సమస్యలను, ప్రభుత్వ లోపాలను ఎత్తిచూపుతున్న 'సాక్షి' గొంతు నొక్కేందుకు పోలీసులను ప్రయోగించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు శుక్రవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద వివిధ జర్నలిస్ట్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. నకిలీ మద్యం దందాను వెలుగులోకి తెచ్చినందుకు 'సాక్షి' ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డికి, నెల్లూరు బ్యూరో ఇన్‌చార్జికి బీఎన్ఎస్ఎస్ సెక్షన్ల కింద పోలీసులు నోటీసులు జారీ చేయడాన్ని జర్నలిస్టులు తీవ్రంగా తప్పుబట్టారు. ఇది పత్రికా స్వేచ్ఛపై జరిగిన దాడిగా అభివర్ణించారు. నిరసనలో భాగంగా పాత్రికేయులు చేతులకు సంకెళ్లు వేసుకుని, నల్ల రిబ్బన్లు ధరించి తమ ఆవేదనను వ్యక్తం చేశారు. 'కూటమి నిరంకుశ పాలన నశించాలి', 'అక్షరంపై దాడి సిగ్గు సిగ్గు', 'పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లా?' అంటూ ప్లకార్డులు ప్రదర్శించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలు జర్నలిస్ట్ సంఘాల నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మీడియాపై అణచివేత ధోరణి అవలంబిస్తోందని ఆరోపించారు. ప్రశ్నించే గొంతులను అణచివేయాలని చూడటం రాజ్యాంగ విరుద్ధమని, ఇలాంటి చర్యల ద్వారా జర్నలిజాన్ని భయపెట్టలేరని హెచ్చరించారు. ప్రభుత్వం తన దాష్టీకాన్ని ఆపి, పత్రికా స్వేచ్ఛను గౌరవించాలని డిమాండ్ చేశారు. సీనియర్ జర్నలిస్టులు కె.చంద్రమోహన్, డి.హరనాథ్, యర్ర నాగేశ్వరరావు, ఇరోతి ఈశ్వరరావు, బి.ఆనందరావు, పీఏ రావు, రామునాయుడు, సత్యనారాయణ, శ్రీనివాసరెడ్డి, కింతాడ మదన్‌తో పాటు పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



పత్రికా స్వేచ్ఛపై దాడిని ఖండించాలని నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు, జర్నలిస్ట్ సంఘాల ప్రతినిధులు

వార్త తప్పు అయితే ఖండన ఇవ్వాలి



ఏదైనా వార్తలో లేదా కథనంలో తప్పులు ఉన్నట్లయితే, అందుకు సంబంధించిన వివరణ ఇవ్వాలి. లేదంటే ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు ఫిర్యాదు చేయాలి. లేదా న్యాయస్థానం ద్వారా న్యాయ పోరాటం చేయవచ్చు. గతంలో మీడియాను వేధించే ఇలాంటి సంస్కృతి లేదు. ప్రస్తుతం జర్నలిస్టులకు సంబంధించిన కమిషన్ లేదు. జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు కూడా లేవు. ప్రభుత్వం మీడియాను వేధించే చర్యలను ఆపి, జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి.

– గంట్ల శ్రీనుబాబు, సీనియర్ జర్నలిస్ట్, కార్యదర్శి, జాతీయ జర్నలిస్టుల సంఘం

దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం



'సాక్షి'పత్రికపై జరుగుతున్న దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఏదైనా వార్తలో లేదా కథనంలో తప్పు ఉంటే, సంబంధిత పత్రికకు వివరణ ఇచ్చేందుకు అవకాశం కల్పించాలి. లేదా ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు ఫిర్యాదు చేయాలి. సుప్రీంకోర్టు పలుమార్లు హెచ్చరించినప్పటికీ.. అందుకు భిన్నంగా జర్నలిస్టులను వేధింపులకు గురిచేయడం దారుణం. రాజకీయ ప్రేరేపితంగా పెట్టిన తప్పుడు కేసులను వెంటనే ఎత్తివేయాలి. జర్నలిస్టులకు రక్షణ కల్పించాలి.

– సత్యనారాయణ, సీనియర్ జర్నలిస్ట్, అధ్యక్షుడు, లోకల్ న్యూస్‌పేపర్స్ అసోసియేషన్

సిగ్గుమాలిన చర్య



కూటమి ప్రభుత్వం చేస్తున్న సిగ్గుమాలిన చర్య ఇది. 'సాక్షి'ఎడిటర్‌పై పెట్టిన కేసులను భేషరతుగా ఎత్తివేయాలి. ఆర్టికల్ 19(1) కింద రాజ్యాంగం ప్రసాదించిన పత్రికా స్వేచ్ఛను, భావ ప్రకటన హక్కును పాశవికంగా కాలరాస్తూ.. కుతంత్రాలకు తెగబడుతోంది. 80 ప్రశ్నలు ఇచ్చి, అప్పటికప్పుడు సమాధానం చెప్పమన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న ఈ దుశ్చర్యను ప్రజాస్వామ్యవాదులంతా ఖండించాలి.

– ఎంఆర్ఎన్ వర్మ, సీనియర్ జర్నలిస్ట్, ఏపీడబ్ల్యూజేఎఫ్

'సాక్షి'ని టార్గెట్ చేయడం సరికాదు



సాక్షి మీడియాను కూటమి ప్రభుత్వం టార్గెట్ చేసింది. పత్రికా స్వేచ్ఛను అణచివేసేందుకు ప్రయత్నిస్తోంది. నకిలీ మద్యం మాఫియా ఆగడాలను 'సాక్షి' పత్రిక బయటపెడుతున్నందుకే.. ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు దిగుతోంది. జర్నలిస్టులపై, మీడియా సంస్థపై వేధింపులు మానుకోవాలి.

– వి.నారాయణ, సీనియర్ రిపోర్టర్, ఏపీడబ్ల్యూజే

'సాక్షి'లో సోదాలు అప్రజాస్వామికం



కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా పాలన సాగిస్తోంది. సాక్షి కార్యాలయంలో జరుగుతున్న సోదాలు, తనిఖీలు కేవలం వేధింపుల చర్యలే. మీడియా గొంతుకను అణిచివేసే ప్రయత్నం చేస్తే.. ప్రభుత్వం అందుకు తగిన మూల్యం చెల్లించుకోకతప్పదు. ప్రభుత్వ విధానాలపై వార్తలు రాస్తున్నారనే అక్కసుతో 'సాక్షి'పై పోలీసులతో సోదాలు, దాడులు చేయించడం అప్రజాస్వామికం. ప్రజాస్వామ్యవాదులంతా ఈ చర్యలను ఖండించాలి.

– రామచంద్రరావు, సీనియర్ జర్నలిస్ట్, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏపీడబ్ల్యూజేఎఫ్

రాజ్యాంగ హక్కులను ప్రభుత్వం కాలరాస్తోంది



ప్రభుత్వం రాజ్యాంగం కల్పించిన హక్కును కాలరాస్తోంది. సుప్రీంకోర్టు చేసిన సూచనలను సైతం ఉల్లంఘిస్తోంది. జర్నలిస్టులపై పెట్టిన కేసులను తక్షణమే ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలి. ఈ ప్రభుత్వ చర్యలను జర్నలిస్టుల సంఘాలన్నీ ఐక్యంగా ఖండిస్తున్నాయి.

– బి.రవికాంత్, సీనియర్ పాత్రికేయుడు

పత్రికా స్వేచ్ఛను కాపాడాలి



పత్రికా స్వేచ్ఛను కాపాడాల్సిన ప్రభుత్వమే దానిని కాలరాస్తే ఎలా? మీడియాపై రాజకీయ కక్ష సాధింపులు తగవు. ప్రభుత్వ వైఫల్యాలపై కథనాలు వచ్చినంత మాత్రాన పత్రిక కార్యాలయాలపై పోలీసులు దాడులు చేయడం సరికాదు. ఎడిటర్‌ను బెదిరించడం, కార్యాలయంలో సోదాలు నిర్వహించడం వంటి చర్యలు అభ్యంతరకరం. ప్రభుత్వం ఈ అప్రజాస్వామిక చర్యలను తక్షణమే నిలిపివేయాలి.

– సాంబ, సీనియర్ జర్నలిస్ట్, ఏపీడబ్ల్యూజే

జర్నలిస్టులపై దాడులు దుర్మార్గం



ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛను హరిస్తోంది. ఈ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం. ప్రభుత్వ వైఫల్యాలపై వార్తలు రాస్తున్న జర్నలిస్టులపై అక్రమ కేసులు బనాయించడమే కాకుండా, వారిపై దాడులు చేయడం అత్యంత దుర్మార్గం.

– బంగారు అశోక్, సీనియర్ జర్నలిస్ట్, స్మార్ట్‌సిటీ జర్నలిస్ట్స్ అసోసియేషన్

నోటీసులు ఇవ్వడం సరికాదు



కూటమి ప్రభుత్వం దేశ అత్యున్నత న్యాయస్థానాన్నే ధిక్కరిస్తోంది. జర్నలిస్టులపై ఈ ప్రభుత్వం వ్యవహరించిన తీరు దారుణం. విలేకరులపై పోలీసులు పదే పదే కేసులు నమోదు చేయడాన్ని మీడియాపై జరుగుతున్న టెర్రరిజంగానే పరిగణించాలి. ప్రచురించిన వార్తకు సంబంధించిన సమాచారం అడగడం పేరిట పత్రికా కార్యాలయాలకు నోటీసులు ఇవ్వడం సరికాదు.

– కేఎం కీర్తన్, అధ్యక్షుడు, జాప్ విశాఖ యూనిట్

జర్నలిస్టులకు రక్షణ కల్పించాలి

రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛా హక్కులను ఎలా హరిస్తారు? ప్రభుత్వం నైతిక విలువలు తెలుసుకోవాలి. జర్నలిస్టులకు రక్షణ కరువైంది. మీడియాపై జరుగుతున్న ఇటువంటి దాడులు ప్రభుత్వ దిగజారుడుకు నిదర్శనం. ప్రభుత్వం వెంటనే తన వైఖరిని మార్చుకుని, పత్రికా స్వేచ్ఛను గౌరవించాలి.

– వేణుగోపాల్ కోనేరు, సీనియర్ జర్నలిస్ట్(సీటీవీ)

అప్పన్న దర్శన వేళల్లో మార్పులు

సింహాచలం: ఈ నెల 20న నరక చతుర్దశి, 21న దీపావళి అమావాస్య సందర్భంగా శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దర్శన సమయాల్లో మార్పులు చేసినట్టు సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు శుక్రవారం తెలిపారు. ఈ నెల 20న రాత్రి 7 వరకు, 21న సాయంత్రం 6 వరకు మాత్రమే స్వామివారి దర్శనాలు లభిస్తాయన్నారు. ఆ రెండు రోజుల్లో రాత్రి ఆరాధనసేవ టిక్కెట్లు రద్దుచేసినట్టు పేర్కొన్నారు. 22న స్వాతినక్షత్రంను పురస్కరించుకుని శ్రీనృసింహ హోమం, నిత్యకల్యాణం యథావిధిగా జరుగుతాయన్నారు. ఆరోజు గరుడసేవ, సహస్రనామార్చన రద్దుచేసినట్లు తెలిపారు. ఈ నెల 23 నుంచి 27 వరకు శ్రీమణవాళ మహాముసుల తిరునక్షత్రం పూజలు నిర్వహించనున్నారు. దీంతో ఆయా రోజుల్లో నిత్యకల్యాణం, సహస్రనామార్చన, స్వర్ణపుష్పార్చన, గరుడసేవలు రద్దు చేసినట్లు వెల్లడించారు. భక్తులు ఈ విషయాన్ని గమనించి, దర్శనానికి రావాల్సిందిగా కోరారు.

డీఆర్వోకు కలెక్టర్ క్లాస్?

రెవెన్యూలో 'లేఖ'ప్రకంపనలు

సాక్షి ఎఫెక్ట్..

మహారాణిపేట: ఆర్డీవో శ్రీలేఖ రాసిన లేఖ వ్యవహారంపై 'రెవెన్యూలో శ్రీలేఖ కలకలం' శీర్షికతో శుక్రవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనం జిల్లా రెవెన్యూ శాఖలో ప్రకంపనలు సృష్టించింది. ఉన్నతాధికారుల మధ్య కోల్డ్‌వార్ వెలుగులోకి రావడంతో రెవెన్యూ, నిఘా వర్గాల ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించి.. ఏం జరుగుతుందోనని ఆరా తీశారు. జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్ శుక్రవారం హుటాహుటిన కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్‌ను కలిశారు. ఈ అంశంపై వారిద్దరి మధ్య సుదీర్ఘ చర్చ జరిగినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో డీఆర్వో తీరుపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేయడంతో పాటు ఆయనకు క్లాస్ పీకినట్లు తెలుస్తోంది. మరోవైపు ఈ వివాదంపై రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు కూడా స్పందించారు. కలెక్టర్‌ను కలిసి, శాఖ ప్రతిష్ఠకు భంగం కలగకుండా తక్షణమే దిద్దుబాటు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అయితే, ఈ విషయాన్ని ఇక్కడితో వదిలేయాలని, అనవసర రాద్ధాంతం చేయవద్దని కలెక్టర్ వారికి సూచించినట్లు సమాచారం.

కాసుల వేట

కమర్షియల్ ట్యాక్స్‌కు కాసులు కురిపిస్తున్న దీపావళి



గుట్టుచప్పుడు కాకుండా బాణసంచా దిగుమతి చేస్తున్న వ్యాపారులు

పట్టుకొని వదిలేస్తున్న వాణిజ్య పన్నుల శాఖ సిబ్బంది

బాణసంచా విలువను బట్టి.. వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు

లైసెన్సులు మంజూరు విషయంలోనూ చేతివాటం

సాక్షి, విశాఖపట్నం: జిల్లా శివారు ప్రాంతానికి ఒడిశా నుంచి ఓ పెద్ద వ్యాన్ వచ్చింది. ముందస్తు సమాచారం మేరకు వాణిజ్య పన్నుల శాఖ సిబ్బంది ఆ వ్యాన్‌ను అడ్డగించారు. తెరిచి చూస్తే.. అందులో భారీగా బాణసంచా సామగ్రి ఉంది. కానీ, దానికి సంబంధించిన ఎలాంటి బిల్లులూ లేవు. సీజ్ చేస్తామంటూ హడావుడి చేశారు. కానీ అరగంటలోనే అంతా సద్దుమణిగింది. పట్టుకున్నప్పుడు మతాబులా వెలిగిన కేసు.. కాసేపటికే చైనా టపాసులా తుస్సుమనిపోయింది. ఇందుకు కారణం.. అందులోని టపాసులు కాస్తా 'కాసులు'గా మారి అధికారుల జేబుల్లోకి చేరడమే? వాణిజ్య పన్నుల శాఖలోని కొందరు సిబ్బందికి దీపావళి కాసుల వర్షం కురిపిస్తోంది. బిల్లులు లేకుండా వస్తున్న వాహనాలను పట్టుకోవడం, వ్యాపారులతో బేరసారాలు జరిపి పండగ చేసుకోవడం.. గత వారం రోజులుగా ఇదే తంతు సాగుతోంది. సరకు విలువను బట్టి వసూళ్లకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. చివరికి.. క్రాకర్స్ దుకాణాల లైసెన్సుల విషయంలోనూ పక్కా 'కమర్షియల్'గా వ్యవహరిస్తున్నారంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

దొడ్డిదారిన బాణసంచా

చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దీపావళి పండగను జరుపుకొంటాం. కానీ, వాణిజ్య పన్నుల శాఖలోని కొందరికి మాత్రం ఇది కాసులు కురిపించే పండగగా మారింది. బాణసంచా కొనుగోళ్లు, దిగుమతులు, స్టాల్స్ అనుమతుల పేరుతో ప్రభుత్వ ఖజానాకు వచ్చేది గోరంత అయితే.. సిబ్బంది జేబుల్లోకి చేరుతున్నది కొండంత అని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల పదుల సంఖ్యలో వాహనాలు ఎలాంటి బిల్లులు లేకుండా జిల్లా సరిహద్దుల్లోకి ప్రవేశించాయి. ఈ సమాచారం తెలుసుకున్న నిఘా బృందాలు విజయనగరం, ఒడిశా మార్గాల్లో పహారా కాశాయి. అయితే, ఒకట్రెండు వాహనాలను పట్టుకున్నట్లు చూపించిన సిబ్బంది.. మిగిలిన వాటిని చూసీచూడనట్లు వదిలేశారని తెలుస్తోంది. వ్యాపారులతో కుమ్మక్కై.. భారీగా మామూళ్లు అందుకొని విడిచిపెట్టారని సమాచారం. ఈ వాహనాల్లోని బాణసంచా విలువ ఆధారంగా రేటు కట్టి వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. వీటిని నిజాయతీగా పట్టుకొని, విలువ ఆధారంగా పన్ను విధిస్తే ప్రభుత్వ ఖజానాకు ఆదాయం చేరేది. కానీ, కొందరు సిబ్బంది తమ జేబులు నింపుకోవడానికి సొంత శాఖకే కన్నం వేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలా రూ. కోట్ల విలువైన బాణసంచా ఎలాంటి అనుమతులు, బిల్లులు లేకుండా నగరంలోకి దొడ్డిదారిన చేరిందని నిఘా వర్గాలు అంచనా వేస్తున్నాయి.

నీకూ లాభం.. మాకూ లాభం

నగర పరిధిలో బాణసంచా అమ్మకాల కోసం జీవీఎంసీ, రెవెన్యూ, అగ్నిమాపక, విద్యుత్, పోలీస్ శాఖల అధికారులతో కూడిన కమిటీ నుంచి ముందస్తు అనుమతులు తప్పనిసరి. ఇక్కడే వాణిజ్య పన్నుల విభాగం సిబ్బంది తమ చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు తెలుస్తోంది. తాత్కాలిక విక్రయదారులకు డీలర్‌షిప్ ఉండదు కాబట్టి, వారికి అడ్వాన్స్‌డ్ లైసెన్సులు జారీ చేస్తారు. దీని ప్రకారం తాము విక్రయించబోయే సరకు విలువపై 18శాతం జీఎస్టీని ముందుగానే చెల్లించాలి. ఉదాహరణకు రూ.లక్ష విలువైన సరకు అమ్మితే రూ.18వేలు పన్నుగా చెల్లించాలి. వ్యాపారం ముగిశాక, అమ్మిన సరకు విలువ అంచనా కన్నా ఎక్కువైతే మిగిలిన పన్ను చెల్లించాలి లేదా తక్కువైతే అదనంగా కట్టిన డబ్బును అధికారులు వాపసు ఇవ్వాలి. అయితే, ఇక్కడే కొందరు సిబ్బంది వ్యాపారులతో కుమ్మక్కవుతున్నారు. 'ఎంత సరకైనా అమ్ముకో.. ప్రభుత్వానికి కొద్దిగా పన్ను కట్టి, మాకు కొంత మామూలు ఇస్తే చాలు. నీకూ లాభం, మాకూ లాభం' అంటూ లెక్కలతో సహా వివరిస్తున్నట్లు సమాచారం. ఇందుకోసం డివిజన్ కార్యాలయంలోని ఓ అధికారి ఆదేశాలతో.. సర్కిళ్ల వారీగా వసూళ్లకు ప్రత్యేకంగా ఒక ఉద్యోగిని నియమించుకున్నట్లు తెలుస్తోంది. ఇలా వసూలు చేసిన మొత్తాన్ని కింది నుంచి పై స్థాయి వరకు పంచుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. ఈ విధంగా కొందరు అధికారులు బాణసంచా వ్యాపారం పేరుతో 'అడ్డగోలు వసూళ్ల దీపావళి'ని ఘనంగా జరుపుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



రైతు బజార్‌లో స్టాళ్ల కోసం 22న డ్రా

మహారాణిపేట : జిల్లాలోని రైతు బజార్లలో ఖాళీగా ఉన్న స్టాళ్లను ఈనెల 22న డ్రా ద్వారా కేటాయించనున్నట్టు జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ తెలిపారు. ఆరిలోవ, చిట్టివలసలో కొత్తగా ఏర్పాటు చేసిన రైతు బజార్లతోపాటు మిగతా రైతు బజార్లలో స్టాళ్ల కోసం 129 మంది దరఖాస్తులు పేర్కొన్నారు.

అనకాపల్లి వ్యవసాయ శాఖ జేడీగా ఆశాదేవి

మహారాణిపేట: అనకాపల్లి జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎం.ఆశాదేవి నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆమె విశాఖలో వ్యవసాయశాఖ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ(ఆత్మా) పీడీ పనిచేస్తున్నారు.

అన్ని రంగాల్లో విశాఖ ముందంజలో ఉండాలి

అధికారులను ఆదేశించిన ఎంపీ శ్రీ భరత్


మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్, చిత్రంలో కలెక్టర్ హరేందిర ప్రసాద్, విప్ గణబాబు

మహారాణిపేట : విశాఖ జిల్లా అన్ని రంగాల్లో ముందంజలో ఉండేలా అధికారులు కృషి చేయాలని ఎంపీ ఎం.శ్రీభరత్ అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా స్థాయి అభివృద్ధి సమన్వయ-మానటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో చేపట్టబోయే అభివృద్ధి ప్రాజెక్టులను నిర్ణీత కాలంలో పూర్తి చేయాలన్నారు. ముఖ్యంగా జాతీయ రహదారులను.. నగర రహదారులకు అనుసంధానం చేసే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. గృహ నిర్మాణ పథకాల్లో ప్రగతి సాధించాలని, పీఎం సూర్యఘర్ యూనిట్లను ఎక్కువ సంఖ్యలో నెలకొల్పాలన్నారు. అభివృద్ధి పేరుతో తవ్వుతున్న రోడ్లను నిర్ణీత కాలంలో పూడ్చివేయాలన్నారు. అంగన్‌వాడీలు, ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ పెరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. వర్కింగ్ వుమెన్స్ వసతి గృహాలను త్వరితగతిన పట్టాలెక్కించాలన్నారు. మేజిక్ డ్రైన్లను నిర్మించాలని, వాటి ద్వారా కలిగే ఫలితాలను పరిశీలించి నివేదించాలని చెప్పారు.

తుపాన్లు, వర్షాల సమయంలో రక్షణ ఉండేలా గ్రేట్ గ్రీన్‌వాల్ పేరుతో నాటే మొక్కల విధానాన్ని కొనసాగించాలన్నారు. క్రీడలకు అనుగుణంగా వసతులను కల్పించాలన్నారు. జలవనరులను సంరక్షించాలని, భూగర్భ జలాలు పెరిగేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అమృత్, జలజీవన్ మిషన్ పథకం ద్వారా తాగునీరు అందించాలని చెప్పారు. పర్యాటక ప్రాంతాల్లో పచ్చదనం పెంపొందించాలని, డస్ట్ బిన్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఇటీవల తొలగించిన దుకాణాల ఏర్పాటులో అర్హులకు మాత్రమే అవకాశం ఇవ్వాలని తేల్చి చెప్పారు. ప్రభుత్వ విప్ గణబాబు, ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు పలు ప్రజా సమస్యలను ప్రస్తావించారు. డైమండ్ పార్కు వద్ద జీవీఎంసీ స్థలంలో మల్టీలెవెల్ పార్కింగ్ ప్రాజెక్టు చేపడితే ప్రయోజనం ఉంటుందని సూచించారు. కార్యక్రమంలో కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, జేసీ కె.మయూర్ అశోక్, జెడ్పీ సీఈవో, దిశా కన్వీనర్ నారాయణ మూర్తి, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

అప్పన్న ఆలయ లీకేజీ పనులు పూర్తి

రూ.5 కోట్లతో పూర్తి చేసిన శ్రీవెంకటేశ్వర చారిటబుల్ ట్రస్ట్


పనుల తర్వాత అప్పన్న ఆలయ పైభాగం

సింహాచలం: సింహగిరిపై శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయ పైకప్పు మరమ్మతు పనులు శుక్రవారంతో పూర్తయ్యాయి. వర్షాలకు ఆలయ పైకప్పు నుంచి నీరు లోపలికి చేరుతుండటంతో ఆలయంతోపాటు, ఆలయ ప్రాంగణంలోని కల్యాణమండపం, నివేదనశాల, మ్యూజియం ఉన్న భవనంలో లీకేజీలు అరికట్టేందుకు 9 నెలల కిందట శాస్త్రీయ పద్ధతిలో పనులు ప్రారంభించారు. ఆ పనులు పూర్తికావడంతో సింహగిరిపై భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతో కలిసి పురావస్తుశాఖ డైరెక్టర్ మునిరత్నంరెడ్డి సంబంధిత వివరాలను మీడియాకు వెల్లడించారు. రాష్ట్రంలో తొలుత శ్రీకాళహస్తి ఆలయంలో వర్షం నీరు లీకేజీని అరికట్టే పనులు చేపట్టామన్నారు. ఆ రోజుల్లో నిర్మాణ పనులు ఎలా చేశారో అదే పద్ధతిలో శ్రీకాళహస్తి ఆలయంలో లీకేజీలను అరికట్టేందుకు పుణేకి చెందిన శ్రీవెంకటేశ్వర చారిటబుల్ ట్రస్ట్(వెంకీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్)ను సంప్రదించామన్నారు. అక్కడ ఉత్తమ ఫలితాలు రావడంతో ఆ తర్వాత శ్రీశైలం ఆలయంలో పనులు చేపట్టామన్నారు. సింహాచలం ఆలయం పైకప్పు లీకేజీ పనుల విషయాన్ని ఎమ్మెల్యే గంటా సూచనలతో వెంకటేశ్వర చారిటబుల్ ట్రస్ట్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. రూ.5 కోట్ల సొంత వ్యయంతో 9 నెలల్లో లీకేజీ నిర్మూలన పనులను ట్రస్ట్ పూర్తిచేసిందన్నారు. మరో 200 ఏళ్ల వరకు ఎలాంటి లీకేజీలు ఉండవన్నారు. గంటా మాట్లాడుతూ అప్పన్న ఆలయంలోకి వర్షం నీరు చేరకుండా గతంలో పలుమార్లు నివారణ పనులు జరిగినా పూర్తిగా సఫలీకృతం కాలేదన్నారు. దీంతో వెంకటేశ్వర చారిటబుల్ ట్రస్ట్‌ని సంప్రదించి, పురాతన ఆలయాల నిర్మాణ సాంకేతికతను ఉపయోగించి వెంకటేశ్వర చారిటబుల్ ట్రస్ట్ లీకేజీలను అరికట్టే పనుల్ని చేసిందన్నారు. కార్యక్రమంలో దేవస్థానం ఈవో వి.త్రినాథరావు, అర్చకులు, 98వ వార్డు కార్పొరేటర్ పీవీ నరసింహం, తదితరులు పాల్గొన్నారు.



విశాఖలో ప్రతి ఆదివారం ఆర్గానిక్ సంత

19 నుంచి ఏయూ నార్త్ క్యాంపస్‌లో ప్రారంభం

తాటిచెట్లపాలెం: ఆంధ్ర యూనివర్సిటీ నార్త్ క్యాంపస్‌లో ప్రతి ఆదివారం ఆర్గానిక్ సంత నిర్వహిస్తున్నట్లు భారతీయ కిసాన్ సంఘ్ కేంద్ర కమిటీ సభ్యులు జలగం కుమారస్వామి తెలిపారు. ఈ ఆర్గానిక్ సంతను విజయవంతం చేయాలని నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సీతమ్మధారలోని తహసీల్దార్ కార్యాలయానికి సమీపంలోని కేశవనికేతన్‌లో శుక్రవారం గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సేవా సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ ఈ నెల 19 నుంచి ఏయూ నార్త్ క్యాంపస్‌లో విశాఖ ఆర్గానిక్ సంత నిర్వహిస్తామని తెలిపారు. ఎటువంటి హానికరమైన రసాయనాలు వాడకుండా పండించిన బియ్యం, పప్పులు, కూరగాయలు, చెక్కగానుగ నూనెలు, బెల్లం, అలాగే ఖాదీ, చేనేత వస్త్రాలు ఇక్కడ విక్రయిస్తామని వెల్లడించారు. కంపోస్టింగ్, టెర్రస్ గార్డెన్, బయో ఫెర్టిలైజర్స్, హస్తకళలు వంటి అంశాలపై వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు దాట్ల సుబ్రహ్మణ్యస్వామి, కార్యదర్శి పాలెం నేచురల్స్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్ర సాంకేతిక రంగాల్లో దేశం పురోగతి

డీఆర్‌డీవో డైరెక్టర్ జనరల్ హరప్రసాద్



మాట్లాడుతున్న డీఆర్‌డీవో డైరెక్టర్ జనరల్ డాక్టర్.ఆర్.వి.హరప్రసాద్

మద్దిలపాలెం : శాస్త్ర సాంకేతిక రంగాల్లో దేశం పురోగతి సాధిస్తోందని డీఆర్‌డీవో డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఆర్.వి.హర ప్రసాద్ అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంతో ఎన్ఎస్‌టీఎల్ సంయుక్తంగా నిర్వహిస్తున్న అకడమిక్ కాన్ఫరెన్స్-2025ను శుక్రవారం ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో ప్రారంభించారు. దేశీయంగా అభివృద్ధి చేసిన పలు సాంకేతికతలు సమర్థవంతంగా వినియోగించి సత్ఫలితాలను సాధించిన విధానాన్ని వివరించారు. డీఆర్‌డీవో సమిష్టిగా విశ్వవిద్యాలయాలు సాంకేతిక విద్యాసంస్థలతో కలసి పరిశోధనలు నిర్వహించే దిశగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 100 విద్యాసంస్థలకు చెందిన 500 మందికి పైగా ప్రతినిధులు ఈ సదస్సులో భాగస్వామ్యం అయ్యారన్నారు. నీటిలోపల లోతైన ప్రదేశంలో సమాచారాన్ని సంగ్రహించి, విశ్లేషించే నూతన వ్యవస్థలు, స్టెల్త్ టెక్నాలజీ, సెన్సార్లు వంటివి దేశీయంగా అభివృద్ధి చేయడం, వినియోగించడం జరుగుతోందని తెలిపారు. ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ మాట్లాడుతూ సాంకేతికతలో స్వీయ వికాసం కలిగి ఉండాలని సూచించారు. విశ్వవిద్యాలయాలు, విద్యాసంస్థల నుంచి నూతన ప్రాజెక్టర్ టామ్‌సేజ్ సాంకేతికతలను అభివృద్ధి చేసే దిశగా పరిశోధనలో పెరగాలని సూచించారు. ఐడీఆర్‌డీవో డైరెక్టర్ జనరల్ డాక్టర్ మను కోరుల్లా వర్చువల్ విధానంలో మాట్లాడుతూ రానున్న రోజుల్లో 100 పేటెంట్లు సాధించడం లక్ష్యంగా కలిసి పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ అబ్రహం వర్గీస్, ఏయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య జి.శశిభూషణరావు, కార్యక్రమ సమన్వయకర్త ఆచార్య టి.వి.కె భానుప్రకాష్, ఏఐఎ, ఎన్ఎస్‌టీఎల్ శాస్త్రవేత్త వివిఎప్ సాజీ, డిప్యూటి శాస్త్రవేత్త టి.వేణుగోపాలరావు, డీఆర్‌డీవో శాస్త్రవేత్తలు తదితరులు ప్రసంగించారు.

నలుగురు విద్యార్థులకు గాయాలు

తగరపువలస: భీమిలి మండలం శింగనబంద పంచాయతీ మద్దిలపేట మలుపు రోడ్డులో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన ప్రమాదంలో నలుగురు విద్యార్థులకు గాయాలయ్యాయి. పద్మనాభం మండలం రేవిడికి చెందిన విద్యార్థులు కొయ్య స్నేహలత, గొలగాని చేతని, గొలగాని కృష్ణవేణి, విజయ్ తగరపువలసలోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నారు. వీరు కళాశాలకు వెళ్లేందుకు ఆటోలో వస్తుండగా మద్యం మత్తులో ఉన్న వ్యక్తి కారును వేగంగా నిర్లక్ష్యంగా నడుపుతూ ఆటోను ఢీకొన్నట్టు విద్యార్థులు తెలిపారు. ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను చికిత్స కోసం విజయనగరం తరలించారు. భీమిలి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

ఆకట్టుకున్న క్రీడా పరికరాల ప్రదర్శన


క్రీడా సామగ్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

విశాఖ స్పోర్ట్స్: సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌లో భాగంగా శుక్రవారం డీఎస్ఏ జిమ్నాస్టిక్స్ ఇండోర్ హాలులో క్రీడా పరికరాలు, హస్తకళల ప్రదర్శన, విక్రయాలను ఏర్పాటు చేశారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, సెట్విస్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రదర్శనను క్రీడాకారులు, నగర ప్రజలు వీక్షించారు. ముఖ్యంగా క్రీడా పరికరాల కొనుగోలుకు ఆసక్తి చూపించారు. ఎగ్జిబిషన్‌ను కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ సందర్శించి అందుబాటులో ఉన్న వస్తువుల నాణ్యతను పరిశీలించారు. జిల్లా క్రీడాధికారి వెంకటేశ్వరరావు, సెట్విస్ సీఈవో కవిత, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆవిష్కర్తలకు అండగా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో నూతన ఆవిష్కరణలు, స్టార్టప్‌లను ప్రోత్సహించే లక్ష్యంతో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ విశాఖపట్నం కేంద్రంగా 'ఫ్యూచర్ ఫౌండర్స్ ప్రొగ్రామ్'ను శుక్రవారం ప్రారంభించింది. 'ఒక కుటుంబం - ఒక పారిశ్రామికవేత్త' మిషన్‌కు అనుగుణంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ మాట్లాడుతూ ప్రాంతీయ సామాజిక-ఆర్థిక అభివృద్ధిలో స్టార్టప్‌ల పాత్ర కీలకమన్నారు. హబ్ సీఈవో ధాత్రి రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఆవిష్కరణలను విస్తరించే ప్రణాళికలను వివరించారు. హబ్ విశాఖ సీఈవో రవి ఈశ్వరపు మాట్లాడుతూ యువ ఆవిష్కర్తలకు అవసరమైన అన్ని వనరులను అందించి, రాష్ట్రంలో బలమైన స్టార్టప్ ఎకోసిస్టమ్‌ను నిర్మించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ ప్రారంభోత్సవంలో 48 స్టార్టప్‌లు, విద్యార్థులు, మహిళా ఆవిష్కర్తలతో సహా మొత్తం 76 మంది పాల్గొన్నారు. ఎంపిక చేసిన అభ్యర్థులకు డిజైన్-థింకింగ్, బిజినెస్ మోడలింగ్, ప్రోటోటైప్ అభివృద్ధి వంటి అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు.

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	: రూ.145
స్కిన్	: రూ.260
స్కిన్‌లెస్	: రూ.270

కోడిగుడ్ల ధరలు

రూ.లలో (వందకు)

విశాఖ	545.00
విజయనగరం	549.00
శ్రీకాకుళం	549.00

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

జిల్లాలో జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాలు ఆయా కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపాయి. కూర్మన్నపాలెం కూడలి వద్ద జరిగిన ప్రమాదంలో ఆర్టీసీ బస్సు ఢీకొని వివాహిత మృతి చెందగా, ఆమె భర్త గాయపడ్డాడు. ఆరిలోవ బీఆర్‌టీఎస్ రోడ్డు మార్గంలో జరిగిన మరో ప్రమాదంలో ద్విచక్రవాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొనడంతో గీతం ఇంజినీరింగ్ విద్యార్థి ప్రాణాలు కోల్పోయాడు.

ఆర్టీసీ బస్సు ఢీ.. వివాహిత మృతి

భర్తకు తీవ్ర గాయాలు


ఉమాదేవి(ఫైల్)

కూర్మన్నపాలెం: కూర్మన్నపాలెం కూడలి వద్ద శుక్రవారం తెల్లవారుజామున మృత్యువు కాపు కాసింది. పెళ్లై ఏడాదైన జంట స్కూటీపై ప్రయాణిస్తుండగా.. ఆర్టీసీ బస్సు రూపంలో మృత్యువు వారి జీవితాలను కబళించింది. నిండు నూరేళ్ల దాంపత్యం ఒక్క క్షణంలోనే విషాదంగా ముగిసింది. కూర్మన్నపాలెం ముఖ్య కూడలి సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో పెదగంట్యాడ మండలానికి చెందిన వియ్యపు ఉమాదేవి(22) మృతి చెందగా, ఆమె భర్త పైడిరాజు గాయపడ్డాడు. ఈ సంఘటనకు సంబంధించి దువ్వాడ పోలీసులు అందించిన వివరాలివి.. విశాఖ ఉక్కు కర్మాగారంలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్న వియ్యపు పైడిరాజు, తన తల్లిదండ్రులు, భార్యతో కలిసి పెదగంట్యాడ మండలం సీతానగరంలో నివాసం ఉంటున్నాడు. అనకాపల్లి మండలం కొత్తూరులో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లాల్సి ఉండడంతో శుక్రవారం తెల్లవారుజామున భార్య ఉమాదేవితో కలిసి స్కూటీపై ఇంటి నుంచి బయలుదేరాడు. కూర్మన్నపాలెం కూడలికి సమీపిస్తున్న సమయంలో.. సింధియా నుంచి చోడవరం వెళ్తున్న ఆర్టీసీ బస్సు వారి స్కూటీని బలంగా ఢీకొంది. దీంతో స్కూటీపై ప్రయాణిస్తున్న ఉమాదేవి కుడి వైపునకు, పైడిరాజు ఎడమ వైపునకు పడిపోయారు. ఉమాదేవిపై నుంచి బస్సు చక్రాలు దూసుకుపోవడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. స్థానికులు వెంటనే అంబులెన్స్ సహాయంతో ఆసుపత్రికి తరలించగా, అప్పటికే ఆమె మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పైడిరాజుకు నడుము భాగంలో తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా.. ఉమాదేవికి, పైడిరాజుకు వివాహం జరిగి ఏడాది కావస్తోంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి.. ఉమాదేవి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

సీతానగరంలో విషాదఛాయలు

పెదగంట్యాడ: కూర్మన్నపాలెం కూడలి వద్ద జరిగిన ప్రమాదంలో ఉమాదేవి దుర్మరణంతో సీతానగరంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పెళ్లైయిన ఏడాదికే ఆమెను మృత్యువు బస్సు రూపంలో కబళించడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

డివైడర్‌ను ఢీకొని విద్యార్థి దుర్మరణం


విశాల్ మృతదేహం

ఆరిలోవ: బీఆర్‌టీఎస్ రోడ్డు మార్గంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ఇంజినీరింగ్ విద్యార్థి ప్రాణాలు కోల్పోయాడు. మృతుడిని విజయనగరానికి చెందిన చిలకలపల్లి విశాల్ (21)గా గుర్తించారు. విశాల్ గీతం విశ్వవిద్యాలయంలో నాలుగో సంవత్సరం ఇంజనీరింగ్ చదువుతున్నాడు. ఆయన పెందుర్తి ప్రాంతంలోని పురుషోత్తమపురంలో తన మామయ్య ఇంట్లో ఉంటూ కళాశాలకు వెళ్తున్నాడు. గురువారం సాయంత్రం విశాల్ తన స్నేహితుడు సూర్యతో కలిసి కళాశాల నుంచి ద్విచక్రవాహనంపై ఇంటికి తిరిగి వెళ్తున్నాడు. హనుమంతవాక మీదుగా బీఆర్‌టీఎస్ రోడ్డులో వెళ్తున్న క్రమంలో.. శ్రీకృష్ణాపురం సమీపంలో వారు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనం అదుపు తప్పి డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కిందపడిన విశాల్ గుండెకు తీవ్ర గాయం తగిలి అంతర్గత రక్తస్రావం జరిగింది. సూర్యకు స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన విశాల్‌ను స్థానికులు.. ఆరిలోవ పోలీసుల సహాయంతో విమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ విశాల్ మృతిచెందాడు. దీంతో పోలీసులు మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. శుక్రవారం మృతదేహానికి శవ పంచనామా నిర్వహించి, అనంతరం తల్లిదండ్రులకు అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉంది.

గల్లంతైన శ్రీను మృతదేహం లభ్యం

మూలకుద్దు వద్ద గుర్తింపు


తమ్మిన శ్రీను(ఫైల్)

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్, ఒకటో వార్డులోని బాలాజీనగర్ వద్ద గోస్తనీ నదిలో మంగళవారం స్నానానికి దిగి గల్లంతైన తమ్మిన శ్రీను (36) మృతదేహం శుక్రవారం మూలకుద్దు తీరంలో లభించింది. శ్రీను ఆచూకీ కోసం మూడు రోజులుగా భీమిలి పోలీసులు, తాళ్లవలస అగ్నిమాపక సిబ్బంది, బంధువులు, మత్స్యకారులు, ఏపీఎస్‌డీఆర్ఎఫ్ బృందం టి.నగరపాలెం, తగరపువలస ప్రాంతాల్లోని గోస్తనీ నదిలో గాలించారు. కాగా.. శుక్రవారం శ్రీను మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం బాలాజీనగర్ శ్మశానవాటికలో అంత్యక్రియలు పూర్తి చేశారు. శ్రీనుకు భార్య సుగుణతో పాటు 10, 12 ఏళ్ల వయసు గల ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ నెల 13న మృతుడి బావ పీసా త్రిమూర్తులు ఆత్మహత్య చేసుకున్నారు. 14న జరిగిన ఆయన అంత్యక్రియల అనంతరం, శ్రీను నదిలో స్నానానికి దిగి గల్లంతైన సంగతి తెలిసిందే. కేవలం రెండు రోజుల వ్యవధిలో బాలాజీనగర్‌కు చెందిన బంధువులు ఇద్దరు మృతి చెందడంతో స్థానికంగా విషాదం నెలకొంది. ఈ రెండు సంఘటనలకు సంబంధించి భీమిలి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఫీజు చెల్లించలేదని ల్యాబ్ పరీక్షలకు అనుమతించలేదు

తగరపువలస : భీమిలి మండలం దాకమర్రి ఎస్ఎస్ఆర్ఐటీ కళాశాల యాజమాన్యం ట్యూషన్ ఫీజు చెల్లించని విద్యార్థులను ల్యాబ్ పరీక్షలకు అనుమతించలేదు. దీంతో శుక్రవారం విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. గత విద్యా సంవత్సరం నుంచి కూటమి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయనందున కళాశాలల యాజమాన్యాలు నిర్వహణ ఖర్చులు భరించలేక విద్యార్థులపై ఒత్తిడి తీసుకువస్తున్న సంగతి తెలిసిందే. ఎస్ఎస్ఆర్ఐటీ యాజమాన్యం విద్యార్థులు రూ.10 వేల చొప్పున చెల్లిస్తేనే సెమిస్టర్ పరీక్షలకు అనుమతిస్తామని చెప్పడంతో కొందరు విద్యార్థులు చెల్లించారు. ఫీజు చెల్లించలేని విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రాధేయపడినా యాజమాన్యం అనుమతించలేదని వాపోయారు. కళాశాలకు చెల్లించాల్సిన అన్ని రకాల ఫీజులు చెల్లించినా ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయడంలో విఫలం కావడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. దీనిపై కళాశాల ప్రిన్సిపాల్ ఖాదర్‌బాబాను వివరణ కోరగా ఫీజు చెల్లించని విద్యార్థులను ల్యాబ్ పరీక్షలకు అనుమతించలేదన్నది వాస్తవం కాదన్నారు.

గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో చోరీ కేసు ఛేదన

రూ. 7 లక్షల విలువైన బంగారు నగలు, మొబైల్ రికవరీ


స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలతో రైల్వే పోలీసులు

తాటిచెట్లపాలెం: రైలులో చోరీకి గురైన బంగారు ఆభరణాలను గుర్తించి, దొంగతనానికి పాల్పడిన మైనర్‌ను రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలివి. ఈ నెల 14న హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వచ్చే గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్న చిగురువలసకు చెందిన అట్లూరి హేమకుమారి బంగారు నగలు చోరీకి గురయ్యాయి. దీనిపై బాధితులు విశాఖపట్నం గవర్నమెంట్ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. జీఆర్పీ సీఐ సిహెచ్.ధనుంజయ నాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ కేటీఆర్ లక్ష్మి, సిబ్బంది ఎల్. ఉదయ్‌భాస్కర్, జి. దుర్గాప్రసాద్, ఎం.రాజేష్‌లతో కూడిన బృందం ఈ కేసును దర్యాప్తు చేపట్టింది. రైళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న మైనర్‌కు ఈ చోరీలో సంబంధం ఉన్నట్లు గుర్తించి, అతన్ని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద నుంచి సుమారు రూ.7లక్షల విలువైన చోరీ సొత్తును పోలీసులు రికవరీ చేశారు. ఇందులో రెండు వరుసల బంగారు చంద్రమాల(24 గ్రాములు), బంగారు నల్లపూసల గొలుసు(17.24 గ్రాములు), లాకెట్ ఉన్న బంగారు గొలుసు(17.068 గ్రాములు), ఒక శాంసంగ్ మొబైల్ ఫోన్ ఉన్నాయి. మైనర్‌ను జువెనైల్ హోమ్‌కు పంపించినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

స్వచ్ఛత జీవితంలో భాగం కావాలి



బీచ్ రోడ్డులో జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న ఆచార్య సూర్యప్రకాశరావు

ఏయూక్యాంపస్: స్వచ్ఛత మానవ జీవితంలో అంతర్భాగం కావాలని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య డి.సూర్యప్రకాశరావు అన్నారు. ఆదాయపు పన్ను శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం బీచ్ రోడ్డులో నిర్వహించిన స్వచ్ఛత 5.0 కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ముందుగా కాళీమాత ఆలయం నుంచి చేసిన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించి, కోకో ఎరీనా వద్ద నిర్వహించిన బీచ్ క్లీనింగ్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూర్యప్రకాశరావు మాట్లాడుతూ స్వచ్ఛత ప్రాధాన్యం దేశం తెలుసుకుందని, ఈ దిశగా ప్రతి వ్యక్తి అడుగులు వేస్తున్నారన్నారు. ఆదాయపు పన్ను శాఖ-1 ప్రిన్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ మాట్లాడుతూ స్వచ్ఛత ప్రాధాన్యం, పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను తెలుసుకోవాలన్నారు. తడి, పొడి వ్యర్థాలను వేరుచేయడం, సక్రమంగా నిర్వహించడం ఎంతో అవసరమన్నారు. స్వచ్ఛత ప్రాముఖ్యతను ప్రజలకు చాటే విధంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. ఈ ఆఫీస్, వ్యర్థాల విభజన, పన్ను చెల్లింపుదారులు, ఉద్యోగుల్లో అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్న విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో ఆదాయ పన్ను(అపీల్స్)-3 కమిషనర్ సత్యసాయి రథ్, ఆదాయ పన్ను శాఖ అధికారులు పాల్గొన్నారు.





